



జిల్లాలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు

- జిల్లాలో వైరల్ ఫీవర్‌తో పాటు డెంగ్యూ కేసులు
- వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
- ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ పెరుగుతున్న కేసుల సంఖ్య
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

నిజామాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి. వర్షాకాలం మొదలు కావడంతో వ్యాధుల తీవ్రత పెరుగుతోంది. వైరల్ ఫీవర్‌లతో పాటు డెంగ్యూ, ఇతర వ్యాధులు వ్యాపిస్తున్నాయి. దీంతో రోగులు ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వైద్యుల ద్వారా చికిత్స పొందుతున్నారు. వానాకాలం ఆరంభం కావడం దోమలు కూడా పెరగడం వల్ల ఈ వ్యాధులు పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అంచనాకు వస్తున్నారు. డెంగ్యూ, ఇతర వ్యాధులకు సంబంధించి పాఠశాలలతో పాటు ఆయా గ్రామాల పరిధిలో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు.

134 డెంగ్యూ కేసులు

జిల్లాలో వర్షాలు ఆరంభం అయినప్పటి నుంచి వ్యాధుల తీవ్రత క్రమేపీ పెరుగుతోంది. దోమలతో పాటు పరిసరాల్లో తగిన వాతావరణం లేకపోవడం వల్ల వ్యాధుల తీవ్రత ఎక్కువగా అవుతుంది. దగ్గు, జ్వరము, విరోచనాలతో పాటు ఇతర వ్యాధులు వస్తుండటంతో ఎక్కువ మంది ఆసుపత్రులకు వస్తున్నారు. జిల్లాలో డెంగ్యూకు సంబంధించిన కేసులు కూడా భారీగా పెరుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 134 వరకు డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈ కేసులు బయటపడటంతో సంబంధిత పీహెచ్‌సీల వారిగా ఎక్కువగా వ్యాప్తి చెందకుండా చర్యలను తీసుకుంటున్నారు. జిల్లాలో ఉన్న అన్ని పీహెచ్‌సీల పరిధిలో వీటికి సంబంధించిన చికిత్స అందిస్తున్నారు. జ్వరాలకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచుతున్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కూడా గత కొన్ని రోజులుగా ఓపీ పెరిగింది. ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య ఎక్కువ అవుతుంది. జిల్లాలోని వారే కాకుండా కామారెడ్డి, నిర్మల్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన వారు కూడా వస్తున్నారు. ఈ ఆసుపత్రిలో ఓపీ పెరుగుతుండటం వల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సీరియస్‌గా ఉన్న రోగులను ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ఫీజులు

ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే వారికి మాత్రం ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుంది. జ్వరం, దగ్గు, ఇతర వ్యాధులతో వెళ్లిన వారికి వివిధ పరీక్షలను చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో ఫీజులను వసూలు చేస్తున్నారు. సీరియస్‌గా ఉందని ఆసుపత్రుల్లో చేర్చుకోవడంతో పాటు వేల రూపాయల ఫీజులను తీసుకుంటున్నారు. సాధారణ జ్వరాలు ఉన్నవారు కూడా కొంత ఎక్కువ మొత్తంలో ఖర్చు చేసే పరిస్థితి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిన వారికి ఏర్పడుతుంది. వివిధ కారణాలు చెబుతూ పరీక్షలు నిర్వహించడం వల్ల కొంత మంది చికిత్స కోసం రెండు మూడు రోజులు ఆసుపత్రిలో ఉండి పొందుతున్నారు. ఫీజులను ఎక్కువ మొత్తంలో చెల్లించి డిచ్ఛార్జ్ అవుతు న్నారు. డెంగ్యూ కేసులు బయటపడుతుండటం వల్ల ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎలిసా టెస్టులు చేయకుండానే కొంత మేర నిర్ధారిస్తూ వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలిసాకు సంబంధించిన టెస్టులు పూర్తిస్థాయిలో చేస్తున్న ప్రైవేటులో కొన్ని ఆసుపత్రులు మినహా మిగతా వాటిలో అందుబాటులో లేవు. గ్రామ, మండల స్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందు తున్న గ్రామీణ ప్రాంతంలో సేవలు పొందేవారు కొంతమేర ప్రైవేటును ఆశ్రయించడం వల్ల ఎక్కువ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది.

ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఓపీ

జిల్లా వ్యాప్తంగా కేసుల సంఖ్య పెరుగుతుండటం వల్ల ప్రైవేటు ఆసుపత్రుల్లోనే ఓపీ గత కొన్ని రోజులుగా పెరుగుతోంది. కన్సల్టింగ్‌తో పాటు ఇతర సేవలకు కూడా పెద్ద ఎత్తున రోగులు వస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

జిల్లాలో వ్యాధుల తీవ్రత పెరుగుతుండటంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండలాల పీహెచ్‌సీల వైద్యులు, ఇతర సిబ్బందితో కలిసి పాఠశాలలు, కళాశాలల్లోను అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి చుట్టూ ఏ విధమైన చర్యలు చేపట్టాలో వారికి వివరిస్తున్నారు. డెంగ్యూకు సంబంధించిన కేసులు ప్రబలిన గ్రామాల పరిధిలో ప్రత్యేక చర్యలను తీసుకోవడంతో పాటు రక్తనమూనాలు సేకరించి చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు కొంత మేర ప్రబలుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక చర్యలను చేపట్టి వ్యాధులు వచ్చిన వారికి తగిన చికిత్స అందిస్తున్నామని తెలిపారు. డెంగ్యూ కేసులు ప్రబలిన ప్రాంతాల్లో క్యాంప్‌లను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

బోధన్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో తుకారాం





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ హన్మంతు

ధరణి సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్‌రూరల్, జూలై 4: ధరణి దరఖాస్తుల పరిష్కారంలో అలసత్వం తగదని, యుద్ధప్రాతిపదికన పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ధరణి దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కరం తీరుపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో పెండింగ్‌లో ఉండడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ధరణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, నెల రోజులుగా సూచిస్తున్నప్పటికీ దరఖాస్తుల పరిష్కారం విషయంలో శ్రద్ధ చూపకపోవడం పట్ల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు.. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డుల ఆధారంగా దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ విషయంలో స్పెషల్‌డ్రైవ్ చేపట్టి పెండింగ్ దరఖాస్తులన్నింటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. వాస్తవ పరిస్థితులతో కూడిన నివేదికను నిబంధనలకు అనుగుణంగా రూపొందించి ఆర్డీవో లాగిన్‌కు ఫార్వర్డ్ చేయాలన్నారు. అవసరమైతే అదనపు బృందాలను నియమించుకొని క్షేత్రస్థాయిలో విచారణ జరపాలన్నారు. దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతిని రోజువారిగా పరిశీలించాలని ఆర్డీవోకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్, తహసీల్దార్ గజానన్ ఉన్నారు.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జూలై 4: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ లోగల ఈవీఎం గోదాంను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం సందర్శించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోదాంను ఆయన పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాంను తెరిపించి బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన మీదట గోదాంలలో భద్రపర్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, తదితరులు ఉన్నారు.





కాలురులో హెచ్‌ఎంను చుట్టుముట్టి కంటతడి పెడుతున్న విద్యార్థులు

సార్.. మీరు ఎక్కడికీ వెళ్లొద్దు!

- బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డిని చుట్టుముట్టిన విద్యార్థులు
- భావోద్వేగంతో కాలూరు విద్యార్థుల కన్నీళ్లు
- హెడ్మాస్టర్‌కు ఘనంగా వీడ్కోలు

నిజామాబాద్ రూరల్, జూలై 4: బదిలీపై వెళ్తున్న హెచ్‌ఎంను విద్యార్థులు చుట్టుముట్టి 'సార్ మీరు ఎక్కడికీ వెళ్లొద్దు' అంటూ కన్నీళ్లు పెట్టారు. రూరల్ పరిధిలోని కాలూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన వీడ్కోలు సభలో విద్యర్థులు భావోద్వేగానికి గురయ్యారు. పదమూడేళ్లు ఒకే పాఠశాలలో పనిచేసి, 13 మంది విద్యార్థులున్న పాఠశాలను... 200 మందికి పెంచడంతో గ్రామస్థుల మనసు చూరగొన్నాడు. వీడ్కోలు సమావేశంలో ఎంఈవో రామారావు, నుడామాజీ డైరెక్టర్ ముష్క సంతోష్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి, జిల్లాకార్యదర్శి వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ అగ్గు భోజన్న, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



- తిరుమల కాలనీలో డ్రైనేజీ లేక ఏర్పాటు చేసిన గుంత
- మామిడిపల్లిలో రోడ్డు నిర్మాణానికి కంకర పోసి వదిలేసిన దృశ్యం

విలీన గ్రామాల అభివృద్ధి జరిగేనా?

- ఆరేళ్లు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే
- అభివృద్ధికి నోచుకోని విలీన గ్రామాలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీలు, రహదారులు
- ఇక్కట్లు పడుతున్న విలీన గ్రామ ప్రజలు



ఆర్మూర్‌టౌన్, జూలై 4: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌తో పాటు కొటార్మూర్ విలీన గ్రామాల అభివృద్ధిలో దశదిశ మారేనా? అని గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మున్సిపాలిటీలో విలీనమై ఆరేళ్లు గడుస్తున్నా గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో ఎంతో అభివృద్ధి చెందుతుందోనని అనుకున్న నాయకులు గ్రామాల ప్రజలు నిరాశకు గురయ్యారు. విలీన గ్రామాల్లో ఎన్నికైన ప్రజాప్రతినిధులు గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో వార్డులలో అభివృద్ధి పనులకు నోచుకోకుండా నిరాశకు గురయ్యారు. మున్సిపల్‌లో విలీన గ్రామాలైన పెర్కిట్, కొటార్మూర్‌లో ఎనిమిది వార్డులను, మామిడిపల్లిలో నాలుగు వార్డులను కేటాయించి కౌన్సిలర్లుగా ఎన్నికై నాలుగున్నరేళ్లు గడుస్తున్నా ఇంటి టాక్సులు పెరిగాయే కానీ అభివృద్ధి పనుల ఊసే లేదని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో విలీన గ్రామాలకు 2018లో రూ.20కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయించగా రూ.10కోట్లతో కొంత మేరకు అభివృద్ధి పనులు కాగా గత సంవత్సరం ఆగస్టులో రూ.10కోట్లతో రోడ్లు, డ్రైనేజీల కోసం అగ్రిమెంట్‌లు జరిగాయి. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు కావడంతో రాష్ట్రంలో అధికారం మార్పు జరిగింది. దీంతో కాంట్రాక్టర్‌లు పనులను ప్రారంభించడం లేదు. విలీన గ్రామాల్లో ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. పెర్కిట్ తిరుమల కాలనీలో ఓ ఇంటి నిర్మాణదారుడు డ్రైనేజీ లేక తమ ఇంటి వద్ద డ్రైనేజీ నీటి కోసం గుంతను ఏర్పాటు చేశారు. అలాగే అదే కాలనీలో మరోచోట కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై నీరు చేరడంతో ఇంట్లో నుంచి వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతోంది. దానికి తోడు పలు అభివృద్ధి పనులను శాసనసభ ఎన్నికలకు ముందు ప్రారంభమైనా పనులను సైతం కాంట్రాక్టర్‌లు మధ్యలోనే నిలిపివేసిన ఘటనలు ఉన్నాయి. విలీన గ్రామాల్లో పలు కాలనీలో కల్వర్టు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రాబోయే వర్షాకాలంలో వరదనీరుతో డ్రైనేజీల నీరు కాలనీలో నిలిచిపోయే అవకాశం ఉంది.

అంధకారంలో ప్రధాన రోడ్డు..

మామిడిపల్లి నుంచి పెర్కిట్, కొటార్మూర్ వరకు నిర్మించిన ప్రధాన రోడ్డు మధ్యలో డివైడర్ పనులు ముగిసినా.. సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో రాత్రి సమయంలో రోడ్డు అంధకారంగా మారింది. నిత్యం వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుండడంతో రాత్రి వేళల్లో ఏదో ఒకచోట ప్రమాదం సంభవిస్తుంది. గతంలో ఓ భారీ వాహనంతో పాటు పలు వాహనాలు డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలు లేకపోలేదు. రాత్రివేళల్లో పాదాచారులు రోడ్డు దాటాలంటే భయానక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి డివైడర్ మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతోపాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని విలీన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి చేపట్టాలి..



: సాజిద్, మామిడిపల్లి

మున్సిపల్‌లో విలీనమైనప్పటి నుంచి గ్రామాలల్లో తూతూ మంత్రంగా అభివృద్ధి జరిగిందే తప్ప.. ప్రధాన సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి విలీన గ్రామాలల్లో ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులను చేపట్టాలి.



ముగిసిన జడ్పీ పాలక వర్గ పదవీ కాలం

ఇక నుంచి జడ్పీకి ప్రత్యేక అధికారిగా కొనసాగనున్న కలెక్టర్

జిల్లా పరిషత్ ఖాళీ!

నిజామాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ప్రజాపరిషత్ సభ్యుల పదవీ కాలం గురువారం ముగియడంతో జడ్పీ మొత్తం ఖాళీ అయింది. దీంతో కలెక్టర్‌ను ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆరు నెలల వరకు ఆయన్నే ప్రత్యేక అధికారిగా కొనసాగనున్నారు. ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గం వచ్చిన తర్వాత ప్రత్యేక అధికారుల పాలనకు తెరపడనుంది. ఇప్పటికే గ్రామ పంచాయతీలో, మండల పరిషత్ ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల నియామకాన్ని చేపట్టింది. అన్ని మండల పరిషత్‌లో ప్రత్యేక అధికారులు గురువారం బాధ్యతలను కూడా చేపట్టారు.

మొదలైన ప్రత్యేక అధికారుల పాలన

జిల్లాలో ప్రత్యేక అధికారి పాలన మొదలైంది. స్థానిక సంస్థలు అయిన గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు అన్ని ఖాళీ అయ్యాయి. గ్రామపంచాయతీలో సర్పంచుల పదవీకాలం ఫిబ్రవరి 5తోనే ముగిసింది. పదవీకాలం పూర్తయ్యేంతలోపు ఎన్నికలు ప్రభుత్వం నిర్వహించకపోవడం వల్ల ప్రత్యేక అధికారుల పాలన చేపట్టారు. అన్ని గ్రామ పంచాయతీలకు అధికారులను నియమించారు. వారి ఆధ్వర్యంలోనే పనులను కొనసాగిస్తున్నారు. ఈ రెండు రోజుల్లో మండల పరిషత్‌తో పాటు జడ్పీ సభ్యుల పదవీకాలం కూడా పూర్తికావడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవుతేనే కొత్త పాలకవర్గం రానుంది. ఆరు నెలల్లోపు పంచాయతీరాజ్ చట్టం ప్రకారం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి. మొదట గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తికావడం వల్ల వాటిని నిర్వహించిన తర్వాతనే ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

నిధుల కేటాయింపు

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జడ్పీకి వచ్చే నిధుల ద్వారా ఆయా శాఖల ద్వారా అన్ని మండలాలు, గ్రామాల పరిధిలో పనులను చేపడుతున్నారు. జనాభా దామాషా ప్రకారం నిధులు వస్తుండటంతో వాటిని జిల్లా ప్రజాపరిషత్ సమావేశాల్లో చర్చించి మండలాలకు కేటాయిస్తున్నారు. జడ్పీటీసీలు నిర్ణయించిన పనులకు ఈ నిధులను ఇప్పటి వరకు వెచ్చించారు. ఇక సభ్యుల పదవీకాలం పూర్తికావడంతో ఇప్పటి నుంచి వచ్చే నిధులన్నీ ప్రత్యేక అధికారి కలెక్టర్ ఆధ్వర్యంలో విడుదల కానున్నాయి. జిల్లాలో అవసరమైన పనులకు వీటిని వెచ్చించనున్నారు. జడ్పీ పరిధిలోని ఆయా శాఖల ద్వారా చేపడుతున్న పనులన్నింటిని ప్రత్యేక అధికారి అయిన కలెక్టర్ సమీక్షించనున్నారు. పూర్తిస్థాయిలో నజర్ పెట్టడంతో పాటు పనులను కొనసాగే విధంగా చూడనున్నారు.



నందిపేటలో మెయిన్‌రోడ్డు పనులు షురూ


నందిపేటలో రోలర్‌తో నడుస్తున్న పనులు

నందిపేట, జూలై4: నందిపేట మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మెయిన్‌రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వివేకానంద చౌరస్తా నుంచి ఎన్మాట్ ఐలమ్మచౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా మీదుగా నంది విగ్రహం వరకు ఫోర్‌లైన్ రోడ్డు పనులు చేపట్టారు. అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు జరగడంతో రోడ్డు పనులను అసంపూర్తిగా నిలిపివేశారు. దీంతో చిన్నపాటి వర్షాలకే చిత్తడిగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఇటీవల ఆంధ్రజ్యోతి మెయిన్‌లో రోడ్డు ఇలా ప్రయాణం ఏలా అనే శీర్షికన వార్త కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా స్థాయి ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్‌లు రోడ్డు పనులను ముమ్మరం చేశారు. గుంతలలో ఉన్న మట్టిని తొలగించి కాంక్రిట్ వేస్తున్నారు. రోడ్డు రోలర్‌తో తొక్కిస్తూ బ్లెడ్ ట్రాక్టర్‌తో చదును చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను మళ్ళీ ప్రారంభం కావడంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి'

డిచ్‌పల్లి,జులై 4: గురువారం దేశ వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ సందర్భంగా డిచ్‌పల్లి, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళా శాలలు, పాఠశాలలు పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు మూసీ వేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్ డిమాండ్ చేశారు. నీట్, పరీక్షల అవకతవకలపై న్యాయ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు శ్రీకర్,తేజా, గణేశ్, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం

పెర్కిట్, జూలై4: నీట్, యుజీ 2024ఎంట్రెన్స్ పేపర్ లీకేజీ ఘటనపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. గురువారం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నీట్ పరీక్షను రాష్ట్రాల పరిధిలోకి మార్చాలని, పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం క్షమపణ చెప్పాలని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని పలు పాఠశాలలో విద్యార్థులను సమావేశం పరిచి బంద్‌కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నరేందర్, దుర్గాప్రసాద్, నిఖిల్, సిద్దు, వసంత, అర్వింద్, రాములు, లక్ష్మణ్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

ఏర్గట్ల, జులై 4:నీట్ పరీక్ష విషయంలో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న వ్యక్తులను ఎంతటి వారైనా పట్టుకుని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మం డలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు.

నీట్ విద్యార్థులకు మద్దతుగా బంద్ సక్సెస్

మోస్రా,జులై4: ఎస్ఎఫ్ఐ మోస్రా మండల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల నాయకులు అల్తామాష్ మాట్లాడుతూ నీట్ విద్యార్థులకు మద్దతుగా దేశవ్యాప్త బంద్ కేంద్ర ప్రభుత్వం అధీనంలో నడుస్తున్న ఎన్‌టీఏ బోర్డ్‌ను వెంటనే రద్దు చేసి సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించి 24లక్షల మంది నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రధాని మోడీ కేంద్ర విద్యశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మూసుకున్న నోరు తెరిచి సమస్యను పరిష్కరించాలని అన్నారు. అదే విధంగా కేంద్రం రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని కాపాడి నీట్ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాలచే నిర్వహించాలని అన్నారు. అదే విధంగా కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరించి రీ పరీక్షనునిర్వహించాలని కోరారు. అదే విధంగా తప్పు చేసిన కోచింగ్ సెంటర్లపై శాశ్వతంగా నిషేధించాలని అన్నారు. బాధిత నీట్ విద్యార్థులకు న్యాయం చేయకపోతే అడుగు అడుగునా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకుంటామని అన్నారు. అదే విధంగా యుజీసీ నెట్ విద్యార్థుల పరీక్షను సరిగ్గా నిర్వహించని ఎన్‌టీఏ బోర్డ్‌ను ప్రక్షాళన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీషాన్, అనిల్, మెహ్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో బంద్ విజయవంతం

ముప్కాల్, జూలై4 : నీట్ పరీక్షల రద్దు చేయాలంటూ ముప్కాల్, బాల్కొండ మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బంద్ విజయవంతమైంది. నీట్ పరీక్ష రద్దు చేసి మళ్ళీ నిర్వహించాలని, ఎన్‌టీఏ బోర్డును రద్దు చేయాలని దేశవ్యాప్తంగా విద్యాసంస్థల విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఏరియా కార్యదర్శి నిఖిల్ మాట్లాడుతూ నెలరోజులుగా నీట్ పరీక్ష లీకేజీపై విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో అనేక దఫాలుగా ఉద్యమాలు చేపడుతున్న కేంద్ర మంత్రులు ఇప్పటి వరకూ స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలను నడిరోడ్డుపై పడేసే విధంగా అక్రమంగా పేపర్ లీకేజీ చేయడం ప్రధాని దానిపై మౌనంగా ఉండడం సబబుకాదన్నారు. విద్యార్థి సంఘాలను అక్రమంగా అరెస్టు చేసి పోలీసులు అత్యుత్సాహం చూపించారన్నారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు సిద్ధూరాం, లక్ష్మణ్, జంపన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన బీర్కూర్ విద్యార్థి

బీర్కూర్, జూలై 4 : బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విఘ్నేష్ పదోతరగతి చదువుకుని ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణుడు అయ్యాడు. పదోతరగతి ఫలితాల్లో పదికి పదికి గ్రేడ్ పాయింట్లు సాధించాడు. అనంతరం ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకున్నాడు. బాసర ట్రిపుల్ ఐటీకి విఘ్నేష్ ఎంపికయ్యాడు.

బాధ్యతలు చేపట్టిన నాగిరెడ్డి పేట ప్రత్యేక అధికారి

నాగిరెడ్డిపేట, జూలై 4 : మండల పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం బుధవారం నాటితో ముగియడంతో మండల పరిషత్‌లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. దీనిలో భాగంగా నాగిరెడ్డిపేట మండల పరిషత్‌కు మండలంలోని మాల్తుమ్మెద విత్తన క్షేత్రం ఏడీఏ వీరస్వామిని ప్రత్యేక అధికారిగా నియమించింది. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, ఎంపీడీవో పర్బన్న, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులపై దాడి అమానుషం

తవర్ని, జూలై4: నిజామాబాద్ జిల్లాలో విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసుల దాడిని, విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వ తీరును సీపీఎం పార్టీ వర్ని ఏరియా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ అన్నారు. ప్రధాని మోడీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ చేసిన అక్రమార్కులను అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులను ఒంటిమీద బట్టలు చిరిగేలా ఈడ్చుకుంటూ అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. వెంటనే అరెస్టు చేసిన విద్యార్థి సంఘ నాయకులను బేషరత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ట్రిబుల్ ఐటీకి మోడల్ విద్యార్థుల ఎంపిక

రెంజల్‌రూజులై4: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు అక్షిత, కరీమా బేగంలు బాసర ట్రిబుల్ ఐటీకి ఎంపికవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. గురువారం మోడల్ పాఠశాలలో ట్రిబుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను శాలువ, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ఉన్నత వద్యకై బాసర ట్రిబుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నప్ప, శ్రీనివాస్, ప్రవీణ్, స్వూష్మ తదితరులున్నారు.

ముప్కాల్ విద్యార్థుల ఎంపిక

ముప్కాల్, జూలై4: పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ చాటిన ఎనిమిది మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగారాం తెలిపారు. ముప్కాల్ పాఠశాలలో విద్యార్థులు సీహెచ్.రచన, ప్రశాంత్, పి.కార్తికేయ, ఎ.వైశాలి, ఎం.రచన, అక్షయ, బి.అభినయ, ఎస్.వైశాలిలు ట్రిబుల్ ఐటికి ఎంపిక కాగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అభినందించారు.

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

ఆర్మూర్‌టౌన్, జూలై4: పట్టణంలోని శాస్త్రీనగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దొడ్డికొమురయ్య రజాకార్ల, భూస్వాముల ఆగడాలను కాల్చి బుడిద చేశారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ప్రారంభించారని, పేదలకు భూములు పంచాలని రజాకార్లకు వ్యతిరేకంగా వెట్టిచాకిరి నిర్మూలించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య, రవి, సుజాత, కుల్‌దీప్ శర్మ, చింటు, శ్రావణ్, బంటి, ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని కుమార్‌నారాయణ భవన్‌లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో గురువారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రెటరీ సభ్యులు వి.ప్రభాకర్ మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య భూమి కోసం, భుక్తి కోసం జరిగిన మహత్తర సాయుధ రైతాంగ పోరాటం చేసిన అయన నేటి కమ్యూనిస్టు విప్లవకారుడు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, సహాయకార్యదర్శి రమేష్, నాయకులు ముత్తెన్న, సురేష్, సత్తెక్క, కిసాన్, రాజేశ్వర్, అశోక్, బాబాన్న, దామోదర్, ఎం.నరేంధర్, నిఖిల్, అషిష్, అర్వింద్, ప్రవీన్, తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో ..

భిక్కనూరు, జూలై 04: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలం లోని అయాగ్రామాల్లో వీర తెలంగాణ సాయుధ పోరాట యోదుడు దొడ్డి కొముురయ్య వర్దంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. భిక్కనూరు మండలకేంద్రంలో కుర్మ యువచైతన్య సమితి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కురుమ యువ చైతన్య సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి నిఖీల్ మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం అతిచిన్న వయస్సులో నిజాం, రజకారులకు, దేశముఖ్‌లకు పోరాడిన యోదుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం ప్రతినిధులు మల్లెషం, బీరయ్య, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

భిక్కనూరు, జూలై 04: నీట్ పరిక్షలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విద్యాసంస్థల బంద్ కార్యక్రమం గురువారం విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ఆశోక్, బీవీఎం మండల అధ్యక్షుడు గోసు రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లి మూసివేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసమర్థంగా పరిక్షలు నిర్వహిస్తున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, గత పదేళ్లలో 70పరిక్ష పేపర్లు లీక్‌అయ్యాయని ఆరోపించారు. వెంటనే వీటిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

'పది ఎకరాల లోపు వారికే రైతు బంధు అమలు చేయాలి'

బోధన్‌రూరల్, జూలై 4 : పది ఎకరాల లోపు వారికే రైతుబంధు పథకాన్ని అమలు చేయాలని, బీడు భూములకు, గుట్టలకు రైతుబంధు పథకాలు ఇవ్వవద్దని రైతులు స్పష్టం చేశారు. గురువారం బోధన్ మండలంలోని అమ్దాపూర్, జాడి తదితర సహకార సంఘాల్లో రైతుబంధు పథకం అమలుపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు వర్తింపజేయవద్దన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ 500 రూపాయలు చెల్లించాలన్నారు. భార్యభర్తలు ఇద్దరు కలిపి 5ఎకరాల లోపు ఉన్న వారికే రైతుబంధు అందించాలన్నారు. కౌలు రైతులకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రైతుబంధుపై వాస్తవాలు వివరించే ముందు రైతుల అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంపై అన్ని కోణాల్లో కసరత్తు చేసి రైతుబంధు అమలుకు రూపకల్పన చేస్తుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీనివాస్ రావు, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : పది ఎకరాల లోపు రైతులకే రైతుబంధు పథకాన్ని అమలు చేయ్యాలని, బీడు భూములకు, గుట్టలకు, రోడ్లకు, కాలువలకు, ప్లాట్లు చేసిన భూములకు, బడా వ్యాపారులకు రైతుబంధు పథకాలు ఇవ్వవద్దని రైతులు స్పష్టం చేశారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంతో పాటు జైతాపూర్, జానకంపేట తదితర సహకార సంఘాల్లో రైతుబంధు పథకం అమలుపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రైతుబంధు వర్తింపజేయవద్దన్నారు. పిల్లల పై చదువులకోసం లోను తీసుకుని ఐటీ కడుతున్న రైతులకు రైతుబంధు ఇవ్వాలన్నారు. రేషన్‌కార్డు ప్రాతిపదికన కాకుండా పట్టా బుక్కు ప్రాతిపదికన రైతుబంధు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ 500రూపాయలు చెల్లించాలన్నారు. కౌలు రైతులకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. రైతుబంధుపై వాస్తవాలు వివరించే ముందు రైతుల అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంపై అన్ని కోణాల్లో కసరత్తు చేసి రైతుబంధు అమలుకు రూపకల్పన చేస్తుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శ్రీనివాస్ రావు, సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి, నారాయణ, మిద్దె నరేంధర్, సొసైటీ డైరెక్టర్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం అమలుపై రైతుల సలహాలు, సూచనల కార్యక్రమాన్ని గురువారం రెంజల్, దూపల్లి, నీలా ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక మహాసభలను ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం నూతన విధానంలో రైతులకు రైతుబంధును అందించాలన్న సంకల్పంతో రైతులు వారి అభిప్రాయాలను తెలియాలని రైతులు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదికను అందజేస్తామని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్లు మొయినోద్దీన్, భూమారెడ్డి, ఇమామ్ బేగ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక కోసం రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు తెలియజేసిన సలహాలు, సూచనల మేరకు రైతుబంధుపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవోలు రాము, జీవన్ రెడ్డి, రాందాస్, వ్యవసాయ విస్తీరణ అధికారులు కృష్ణవేణి, అజయ్, గోపికృష్ణ, ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

నవీపేట, జూలై4: ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ సామ్రాట్‌యాదవ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో డెంగ్యూ వ్యాధి నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. దోమల నియంత్రణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కిషన్, వెంకటేశ్వర్ రావు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన

నవీపేట, జూలై 4 : ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం బీసీజీ వ్యాక్సినేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ నియంత్రణ అధికారి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం టీబీ నియంత్రణకు పైలెట్ ప్రాజెక్టుగా 17 జిల్లాలను ఎంపిక చేసిందని, ఇందులో నిజామాబాద్ జిల్లా కూడా ఉందన్నారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వర్ రావు, కిషన్, సిబ్బంది రాణి, పుష్ప, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలున్నారు.

ప్రజలకు సేవ చేయడమే భాగ్యం

● వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి


ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు

ఏర్గట్ల, జూలై 4: ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవ చేయడమే మహాభాగ్యమని ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఎంపీపీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఐదేండ్ల పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించడం, ప్రజాసమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ అశ్రఫ్, ఎంపీటీసీలు బొల్లి శంకర్, ఆడెపు సవిత, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏవో అబ్దుల్‌మాలిక్, ఏఈవో ఆంధ్రయ్య, ఎంపీవో శివచరణ్, ఏపీఎమ్ శ్యామ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'బీపీ, షుగర్ ఉన్న వారికి ట్రీట్‌మెంట్ తప్పనిసరి'

వేల్పూర్, జూలై4: గ్రామాలలో ఐబీపీ, షుగర్ ఉన్న వారిని గుర్తించి వారికి రెగ్యులర్‌గా ట్రీట్‌మెంట్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్‌లు వెంకటేశ్వర్, సురేష్‌లు సూచించారు. గురువారం వేల్పూర్ మండల కేంద్రంలో భీమ్‌గల్, ముచ్కూర్, వేల్పూర్ పీహెచ్‌సీలకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో ఐబీపీ, షుగర్ కేసులు వారందరికీ ఎన్‌సీడీ పోర్టల్ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లోని ప్రజలందరికీ ఏబీహెచ్‌ఏ కార్డు క్రియేట్ చేయాలని, అందుకు గ్రామాల ప్రజలందరూ సహకారం ద్వారా వారి ఆధార్‌కార్డును ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో భీమ్‌గల్, వేల్పూర్, ముచ్కూర్ పీహెచ్‌సీలు సూపర్‌వైజర్‌లు శంకర్, నాగమణి, భూలక్ష్మీ, బాబురావు, ఎఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యావిధానంపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన

బోధన్‌రూరల్, జూలై4 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా విద్యను నేర్పించడమే లక్ష్యంగా నూతన విద్యావిధానంపై టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం బోధన్ ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో జానకి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు మూడురోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. మొదటి రోజులో భాగంగా అంగన్‌వాడీ టీచర్లకు నూతన విద్యావిధానంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీచైర్మన్‌కు సన్మానం

ఎడపల్లి, జూలై 04: జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావును గురువారం కేసిఆర్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదన్న గారి విఠల్ రావు కరోనా సమయంలో చేసిన సేవలు మరువలేనివని వారు కొనియాడారు. కార్యక్రమంలో కేసీఆర్ సేవాదళ్ సభ్యులు శేఖర్ రాజు, తెలంగాణ శంకర్, శేఖర్ రెడ్డి, నీలం రెడ్డి, పృథ్వీ రాజు తదితరులున్నారు.

'ఎరువుల కొరత లేకుండా చూడండి'

ఆర్మూర్‌టౌన్ , జూలై4: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు గురువారం రైతాంగ సమస్యలపై ఆర్డీవో రాజాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌సీజన్ ప్రారంభమైన యూరియా, ఫర్టిలైజర్ కొరత ఉందని, జిల్లాలో కొరత లేకుండా చూడాలని తెలిపారు. రైతులకు కరెంటు సమస్య ఏర్పడుతుందని, లోవోల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల కరెంటు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఏసీపీకి వినతి

ఆర్మూర్‌టౌన్, జూలై4: పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో డొంకేశ్వర్ మండలం చిన్నయానం గ్రామానికి చెందిన పలువురు గురువారం ఏసీపీ బస్వారెడ్డికి వినతిపత్రం అందజేశారు. డొంకేశ్వర్ మండలం చిన్నయానం గ్రామానికి చెందిన కత్తురి రాజమణి, నవనీత, గంగామణిలను అదే గ్రామానికి చెందిన పలువురు ప్రభుత్వ కెనాల్‌కు సంబంధించిన భూమిలో పశువుల పెంటను నిల్వ చేయనిస్తాలేరని, వేరే కులానికి చెందిన వారు పశువుల పెంటను నిల్వ చేసుకుంటున్నారని తమపై కక్షగట్టి అసభ్య పదజలంతో దూషిస్తూ చంపివేస్తామని బెదిరిస్తున్నారని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని నందిపేట ఎస్సై ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలేదని, తమకు ప్రాణ భయం ఉందని ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నందిపేట, జూలై4: మండలంలోని ఆంధ్రానగర్ గ్రామశివారులో ఉన్న పేకాట స్థావరంపై సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ.24 వేల 420 నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతేగాకుండా ఏడుసెల్‌ఫోన్‌లను సీజ్‌చేశారు. ఏడుగురు పేకాట రాయుళ్ళను అదుపులోకి తీసుకొని తదుపరి చర్యల నిమిత్తం నందిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, సిబ్బంది గజేందర్, అనిల్, నర్సయ్య, తదితరులున్నారు.

లెదర్‌పార్క్ స్థలాన్ని కాపాడాలని కలెక్టరకు వినతి

ఆర్మూర్‌టౌన్, జూలై 4 : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాదిగ సంఘాల యూనైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న, గురువారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు లెదర్ పార్క్ స్థలాన్ని కాపాడాలని వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ హయాంలో 401/66 సర్వే నెంబర్‌లో 28ఎకరాల స్థలాన్ని లెదర్ పార్క్ కోసం కేటాయించారన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు గోడను కూల్చి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని, వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాని ఆయన కోరారు. ఆయన వెంట పి.వెంకటేష్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేస్తున్న కొక్కెర భూమన్న

కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది

● హామీలు పూర్తిగా మరిచారు ● బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ముప్కాల్, జూలై4: ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరిసారని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధుల పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో గత పదేళ్లలో ఎన్నడూ జరగని అభివృద్ధి జరిగిందని, చేసిన అభివృద్ధిని ప్రజలు ఎన్నటికైనా ఆదరిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. . అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని చూసి తనను గెలిపించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఒకరు ఆఫీసులను పంచుకుంటే మరొకరు ఇసుక రీచ్‌లను పంచుకుంటున్నారని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలలో బీఆర్ఎస్ పార్టీకి మంచి పేరు ఉందని, ఆ గుర్తింపే వచ్చే ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా మళ్ళీ ప్రజలు ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం వందరోజుల్లో ఆరుగ్యారంటీలు అమలు చేస్తానని చెప్పి ఉచిత బస్సు తప్ప ఏ హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. రుణమాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పూటకో మాట మార్చి విధివిధానాల పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. రైతుల పక్షాన ఎలాంటి కోతలు, ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


బాల్కొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

తాత్కాలిక లబ్ధికోసం ఉన్నత స్థానాన్ని పార్టీని, నాయకత్వాన్ని వదిలి వెళ్లడం సమంజసం కాదని పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. యువతను రెచ్చగొట్టిన నాయకులు బల్మూరి వెంకట్, తీన్మార్ మల్లన్న పదవులు తీసుకొని నోరుమూసుకున్నారని ఎద్దేవ చేశారు. అంతకుముందు ఎంపీపీలు, జడ్పీటీసీలను, ఎంపీటీసీసభ్యులను ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, కో-ఆప్షన్‌సభ్యులు, ఎం పీటీసీసభ్యులు, బీఆర్ఎస్ నాయకులు బద్దం ప్రవీన్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, నాగంపేట్ శేఖర్ పాల్గొన్నారు.

నీట్ విద్యార్థులకు మద్దతుగా వర్సిటీ బంద్

డిచ్‌పల్లి, జూలై 4: నీట్ విద్యార్థులకు మద్దతుగా తెలంగాణ యూనివర్సిటీలో పలు విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనలు చేశారు. ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుతంగా బంద్ నిర్వహిస్తే వర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోకి పోలీసులు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను ఈడ్చుకుంటూ అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేశ్ అన్నారు. పేపర్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని లేనిచో ప్రభుత్వానికి అడ్డు తలుగుతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళనలో ప్రధాని మోదీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కర్క గణేశ్, ఎన్ఎస్‌యూ వర్సిటీ అధ్యక్షుడు శ్రీశైలం, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అక్షయ్, ఎస్ఎఫ్ఐ వర్సిటీ ఉపాధ్య క్షుడు దినేశ్, రాజేందర్, చిత్రు, శివకుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, నిరసనగా తెలంగాణ వర్సిటీలో శాంతి యుతంగా ఆం దోళన చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులపై పోలీసులు ఈడ్చుకెళ్లి అరె స్ట్


టీయూలో ఆందోళన చేస్తున్న విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

చేయడం అప్రజాస్వామ్యకరమని పీడీఎస్‌య నాయకులు శివకుమార్, రాజేందర్‌లు అన్నారు. జరిగిన ఘటనపై సీబీఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు విద్యార్థి నాయకులకు క్షమాపణలు చెప్పాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేక అధికారులు


మోర్తాడ్ ప్రత్యేక అధికారిని సన్మానిస్తున్న ఎంపీడీవో సిబ్బంది


కోటగిరిలో బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎల్‌పీవో సాయిబాబా

కోటగిరి, జూలై4: మండల ప్రత్యేక అధికారిగా గురువారం బోధన్ డీఎల్‌పీవో సాయిబాబా బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగియడంతో జిల్లా అధికారులు ప్రత్యేక అధికారులను నియమించారు. కోటగిరి మండల ప్రత్యేక అధికారిగా సాయిబాబా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, ఎంపీవో మారుతీ, ఏపీవో గంగారాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి మల్లికార్జున్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఆయన తన బాధ్యతలు స్వీకరించారు. మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌ను శాలువాతో కార్యాలయ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు.

రుద్రూరు : మండల పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో మండల పరిషత్‌లకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఇందులో భాగంగా రుద్రూరు మండల పరిషత్‌కు డీఎస్‌సీడీవో శశికళను నియమిస్తూ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు.

మోర్తాడ్ : మండల ప్రత్యేక అధికారిగా జిల్లా వైద్యాధికారి మధుసూదన్ బాధ్యతలు చేపట్టారు. గురువారం మండల పరిషత్ కార్యాలయానికి రాగానే ఎంపీడీవో తిరుమల, ఉద్యోగులు స్వాగతం పలికారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన మధుసూదన్‌ను ఎంపీడీవో తిరుమల, సూపరింటెండెంట్ లింగయ్య, ఉద్యోగులు శ్రీనివాస్, శ్రీధర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది పాల్గొన్నారు.

డిచ్‌పల్లి :మండల ప్రత్యేకాధికారిగా జిల్లా లేబర్ డిప్యూటీ కమిషనర్ యోహన్ బాధ్యతలు స్వీకరించారు. స్పెషల్ ఆఫీసర్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచిం చారు. మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష, జడ్పీటీసీ సభ్యులు పదవీ కాలం ముగిసిన తర్వాత ప్రత్యేకపాలన ప్రభుత్వం ఏర్పాటు చేసిం దన్నారు.

ముప్కాల్: స్థానిక సంస్థల పదవీకాలం ముగియడంతో మండల కేంద్రాలలో స్పెషల్‌ఆఫీసర్లు గురువారం నూతన పదవీ బాధ్యతలు స్వీకరించారు. బాల్కొండ స్పెషల్ ఆఫీసర్‌గా డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రసూల్‌బీ గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అలాగే ముప్కాల్ మండల స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది రసూల్‌బీని శాలువతో సత్కరించారు.

విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వేల్పూర్, జూలై4 : ప్రస్తుత వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య అధికారి కటకం శంకర్ సూచించారు. వేల్పూర్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వాతావరణంలో అకస్మాత్తుగా కలిగే మార్పులు, వర్షాలు కురువడం, నీటి నిల్వ కారణాల వల్ల అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఇళ్లు, ఇంటి పరసరాలలో నీటి నిల్వ ఉండడం వల్ల దోమలార్వ అభివృద్ధి చెందుతుందని, నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని ఆరోగ్య పర్య వేక్షకురాలు నాగమణి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.రాజన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కందకుర్తి ప్రాథమిక పాఠశాలలో మండల కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పాటించవల్సిన నిబంధనలపై వారికి జిల్లా ఆరోగ్య విద్యాబోధకుడు వేణుగోపాల్ రావు అవగాహన కల్పించారు. నీరు కలుషితం కాకుండా చూసుకోవాలని, కలరా, డయేరియా, పచ్చకామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలు, చికిత్స మొదలగు అంశాలపై అవగాహన కలిగి ఉండి వ్యక్తిగత పరిశుభ్రతలో భాగంగా హ్యాండ్ వాషింగ్, తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగ్యూ, మొదలగు వ్యాధులు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, జానకి, రాణి, సరస్వతి, జమున, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డొంకేశ్వర్: ప్రస్తుత వర్షాకాలంలో ప్రభలుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి విద్యాసాగర్ సూచించారు. గురువారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామంలో మహాత్మజ్యోతిరా వుపూలే పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలని, విద్యార్థులు భోజనం చేసే సమయంలో ప్లేట్లను, చేతులను శుభ్రం చేసుకొని భోజనం చేయాలన్నారు. అనంతరం పాఠశాల 22 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించి మందులను పంపిణీ చేశారు.

నేటి కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ


మాట్లాడుతున్న వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు

నవీపేట, జూలై4 : పింఛన్ల పెంపు కోసం శుక్రవారం చేసే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ కోరారు. గురువారం నవీపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు 2వేల నుంచి 4 వేల రూపాయలు, దివ్యాంగులకు 3 వేల నుంచి 6 వేల రూపాయల వరకు పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వివిధ రకాల పింఛన్లను పెంచి లబ్దిదారులకు అందించిందని ఆమె గుర్తు చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నా పింఛన్‌ల పెంపు అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పింఛన్లను పెంచకపోతే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో మానికోళ్ల గంగాధర్, పంతులు, లక్ష్మణ్, ప్రకాష్, రాజు, గంగాధర్, గోదావరి, సాయమ్మ పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై 4 : శాసనసభ స్పీకర్ గడ్డంప్రసాద్‌ను గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, అధికార పార్టీకి మాత్రమే ప్రొటోకాల్ పాటిస్తున్నారని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రొటోకల్ ఖచ్చితంగా పాటించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. అదే విధంగా తిరుమల తిరుపతిలో వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఇచ్చే ఎమ్మెల్యే సిఫారసు లేఖలను పరిగణలోకి తీసుకునే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి స్పీకర్‌ను కోరారు.

పాఠశాలల్లో జరిగే పనులను పూర్తిచేయాలి

● మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్


ఉర్దూ మీడియం పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అధికారి

నవీపేట,జులై4: మండలంలోని వివిధ గ్రామాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పేరుతో జరుగుతున్న పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా ముఖ్యప్రణాళిక అధికారి, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. పాఠశాలలో తాగునీటితో పాటు మరుగుదొడ్ల మరమ్మతులను వెంటనే పూర్తిచేయాలని నిర్వాహకులను కోరారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి తదితరులున్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడుదాం


కొమురయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,జులై4: దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడుదామని ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్ అన్నారు. గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీందార్లకు వారి ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్య పేద ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజాస్వామిక హక్కులకై పేద ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకై పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈర్షద్, బాబు మియా, మోహన్, డి.పోశెట్టి, శ్రీను, గంగారాం, సాయిలు, శంకర్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

ఆర్మూర్‌రూరల్, జూలై4: ఆలూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో పదవీకాలం ముగిసిన వైస్‌ఎంపీపీ బోజకళా చిన్నారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీమల్లేష్‌లను గురువారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గత ఐదేళ్లు ఎంపీటీసీగా బాధ్యతలు నిర్వర్తించి గ్రామాభివృద్ధికి తమవంతు సహకారం అందించారని గ్రామస్థులు కొనియాడారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కల్లెం మోహన్, ఉపసర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, మనోహర్, శివ, దుబ్బాక సంతోష్, పోశెట్టి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కారు చోరీ కేసులో నిందితుల అరెస్ట్

డిచ్‌పల్లి,జులై 4: గత నెల 20న బర్ధీపూర్ శివారులో గల మహేంద్ర షోరుంలో కారు దొంగతనం చేసిన ముగ్గురు దొంగలను పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్‌లు తెలిపారు. పట్టుబడిన నిందితుల్లో అబ్దుల్ సల్మాన్ ఖాన్ (ఫతేనగర్), మహమ్మద్ (అర్మూర్), వాహీద్ పాషా(సిద్ధిపేట), లకు చెందిన వారిగా గుర్తించామని, పదిరోజుల్లోనే నిందితులను ఐడీ పార్టీ, స్థానిక పోలీసులు ప్రత్యేక చొరవ చూపి పట్టుకున్నరని సీఐ, ఎస్సై తెలిపారు. సీపీ కల్మేశ్వర్ నిందితులను పట్టుకున్న పోలీసులను అభినందించారని సీఐ, ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఐడీ పార్టీ సర్దార్, సందీప్, సతీశ్, రాము, సుధాకర్, పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయం వద్ద బోరు వేయించిన ఎంపీటీసీ

ఎడపల్లి, జులై 04: మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో గల పెద్దమ్మ ఆలయం వద్ద ఆ గ్రామ ఎంపీటీసీ వెంకన్నగారి రాంరెడ్డి గురువారం బోరు బావిని తవ్వించారు. గ్రామ శివారులోని ఆలయం వద్దకు వచ్చే భక్తులకు తాగునీటి ఇబ్బందులున్నందున కులసంఘ పెద్దల కోరిక మేరకు బోరు వేయించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు కుర్నాపల్లి ముదిరాజ్ కులసంఘ పెద్దలు, సభ్యులు తదితరులు ఉన్నారు.

'అక్రమ నిర్మాణాలు ఆపి న్యాయం చేయాలి'

పెర్కిట్, జూలై4: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో గల సర్వే నెంబర్ 183 భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇది వరకే మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు అందజేశామని సురకుంట నవీన్ తెలిపారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ రాజును వివరణ కోరగా ఈ సర్వేనెంబర్‌లో నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదని వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ నాయకులు ఫ్లోర్ లీడర్ జీవీ.నర్సింహరెడ్డి మాట్లాడుతూ అధికారులు అండదండలతోనే పట్టణంలోని పలు అక్రమ కట్టడాలు చేపడుతున్నారని అన్నారు.

బాల్కొండలో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

ముప్కాల్, జూలై4: బాల్కొండ మండల కేంద్రంలోని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ ఆధ్వర్యంలో గురువారం జానతాదళ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరంలో ఆయన మొక్కలు నాటారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ గ్రామంలో అమ్మపేరు మీద ఒక మొక్క నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు అంబాటి నవీన్, ప్రధాన కార్యదర్శి మీసాల చందు, మండల కార్యదర్శులు భూసం సత్యనారాయణ, సాయికిరణ్, ముత్యంరెడ్డి, రాంకిషన్, మగ్గిడి లింగన్న, నర్సయ్య, బీజేపీ సీనియర్ నాయకులు గంగసాయన్న, రమేష్, చంటి, నరేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం

డిచ్‌పల్లి,జులై 4: మండలంలోని సుద్దులం గ్రామంలో జడ్పీహెచ్ఎస్‌లో గత పదేళ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన శ్రీదేవి, రమేశ్, సుమలతలను గ్రామంలో విద్యార్థులు, పెద్దలు ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులు పాఠశాల అభ్యున్నతికి 5వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్, కాం గ్రెస్ ప్రతినిధులు సురేందర్ రెడ్డి, రామ్‌రెడ్డి, వినయ్, విఘ్నేశ్, మాజీచైర్మన్ రాజగంగు, ప్రధానోపాధ్యాయులు గంగారాం, ఉపాధ్యాయులు రాజేశ్వర్, నీలబాయి. సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

నిజామాబాద్ అర్బన్, జూలై 4: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. నీట్ ప్రశ్నపత్రాల అవకతవకలపై నిరసనగా ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాలో విద్యాసంస్థల బంద్ జయప్రదమైంది. నిజామాబాద్‌లో విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు నష్టం కలిగేలా నీట్ ప్రశ్నపత్రాల అవకతవకలపై నెలరోజులుగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో పెద్ద మాఫియా దాగి ఉందని కేంద్ర ప్రభుత్వం దోషులను తప్పించడం కోసం ప్రయత్నాలు చేస్తుందని ఇప్పటికైనా నీట్, ఎన్‌టీఏలను రద్దు చేసి పరీక్షలను మళ్లీ నిర్వహించాలన్నారు. దోషులను శిక్షించి విద్యార్థులకు న్యాయం చేయాలని కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థులు నష్టపోతున్నా కేంద్రం స్పందించకపోవడం దారుణమని ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని లేదంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అరెస్టు అయిన వారిలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, ఏఐపిఎస్‌యు జిల్లా కార్యదర్శి అనిల్, అశ్రుద్దీన్, వివిధ సంఘాల నాయకులు ఉన్నారు.


విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

'తెల్లదొరలను ఎదురించిన వీరుడు అల్లూరి'


అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, జూలై 4: తన ప్రాణాలను త్యాగం చేసి మన్యం ప్రజల మాన, ప్రాణ రక్షణకు తెల్లదొరలను ఎదురించిన వీరుడు అల్లూరి సీతారామ రాజు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలోగల అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలను నిర్వహించి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర సంగ్రామంలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అన్నారు. అల్లూరి సీతారామరాజు గిరిజన జాతిని ఏకం చేసి అనగారిన గిరిజన జాతిలో విప్లవ చైతన్యాన్ని రగిలించి గేరిళ్ల యుద్ధ నైపుణ్యాలు నేర్పించి బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వీరుడని అన్నారు. భారతదేశానికి ఆదర్శప్రాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, పల్నాటి కార్తిక్, హరీష్, ఆనంద్ పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తిగా యువత మత్తు పదార్థాలపై పోరాటం చేయాలి..

సుభాష్‌నగర్: యువత అవినీతిపై, మత్తు పదార్థాలపై అల్లూరి స్ఫూర్తిగా పోరాటం చేయాలని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. నగరంలోని కోటగల్లి లోగల అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా ప్రజలకు విముక్తి కోసం పోరాటాలు చేశారని అన్నారు. యువత ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని సమాజాన్ని పట్టి పీడిస్తున్న అవినీతి మత్తుపదార్థాలపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ధర్మపురి, నాయకులు సుదర్శన్, రాజేశ్వర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'దొడ్డికొమురయ్య పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలను నిర్మిద్దాం'

పెద్దబజార్, జూలై 4: దొడ్డికొమురయ్య పోరాట స్ఫూర్తితో ప్రజాఉద్యమాలను నిర్మిద్దాం అని అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. గురువారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో దొడ్డికొమురయ్య వర్ధంతి సభను ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూమయ్య మాట్లాడుతూ ఆనాడు నైజాం నవాబ్ ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటాలు నిర్వహించారని పేదలకు భూములు దక్కాలని జరిగిన వీరోచిత తెలంగాణ సాయుధ పోరాటంలో అమరవీరుడు దొడ్డికొమురయ్య అని అన్నారు. పోరాటంతో పేదలకు 10లక్షల ఎకరాలు భూపంపిణీ చేయడం జరిగిందన్నారు. అలాగే 3వేల గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీల జెండాలు వెలిసాయని ఆ గ్రామాల్లో కమ్యూనిస్టుల పరిపాలన కొనసాగిందన్నారు. ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం భూసంస్కరణ చట్టం 1975లో తీసుకొచ్చారని అన్నారు. భూస్వాముల భూములను తామే స్వయాన పంచుతామని మీరు ఎలాంటి పోరాటాలు నిర్వహించవద్దని ప్రజలను నమ్మించారు. ప్రజానాయకులను యువతీయువకులని తేడా లేకుండా 4వేల ప్రజలను చంపిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, నాయకులు కృష్ణగౌడ్, చిన్నయ్య, గంగాధర్, సుప్రియ, మురళి పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరి పోసిండు

దొడ్డికొమురయ్య అమరత్వమే తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరి పోసిందని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. గురువారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో దొడ్డికొమురయ్య 78వ వర్ధంతి ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నవాబుకు అండగా ఉండి దొరలకు భూస్వాములకు అండగా నిలబడుతూ పేద ప్రజలను రైతాంగాన్ని భూస్వాముల వద్ద వెట్టి చాకిరి చేయిస్తూ నిర్బంధాన్ని ప్రయోగించడంతో పాటు పేద ప్రజల యొక్క మాన, ధన ప్రాణాలను వారి జీవితాలతో ఆడుకుంటున్న సందర్భంలో వాటిని తట్టుకోలేక ప్రజల్లో తీవ్రమైనటువంటి అసంతృప్తి పెరిగి ఆంధ్ర మహాసభ పేరుతో కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాటం మొదలైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, మహేష్, గణేష్ పాల్గొన్నారు.


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

మోపాల్: తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడైన దొడ్డికొమురయ్య 78వ వర్ధంతిని మోపాల్ మండలం సిర్పూర్ గ్రామంలో గురువారం వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డికొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు సాయాగౌడ్ మాట్లాడుతూ ఆనాడు తెలంగాణ ప్రాంతంలో భూమి నైజాం దొరల చేతిలో ఉండేదని భూమి విముక్తి కోసం దొడ్డికొమురయ్య సాయుధ పోరాటాన్ని కొనసాగించారని అన్నారు. భూమిపై హక్కు కోసం పోరాడితే కాల్చి చంపారని అన్నారు. తద్వారా సాగిన రైతాంగ పోరాటంలో 4వేల మంది రైతాంగ గెరిల్లాలను చంపారని అన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని జైలుగా మార్చారని అన్నారు. ప్రజలు హక్కులు అడిగినందుకు అణచివేశారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో గంగమల్లు, నారాయణ, గంగారాం, మహేష్, రాజు, లక్ష్మి, సుజాత, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

సుభాష్‌నగర్, జూలై 4: నగరంలోని పలు డివిజన్‌లలో అభివృద్ధి పనులను నగర మేయర్ దండు నీతూకిరణ్ ప్రారంభించారు. నగరంలోని 26, 46, 48 డివిజన్‌ల పరిధిలో సుమారు 5లక్షల నిధులతో చేపట్టే కల్వర్టు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్లతో కలిసి ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రారంభించిన పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వనిత, అక్బర్ హుస్సేన్, నాయకులు అరుణ్, సల్మాన్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

ధర్పల్లి, జూలై 4: మండలంలోని గ్రామ పంచాయతీలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల ప్రత్యేక అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు సోకకుండా ఎప్పటికప్పుడు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేష్, ఏపీఎం సునీత, ఏపీవో వినోద, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతగా రాజకీయాల్లోకి వచ్చా..

- విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్

ఖిల్లా, జూలై 4: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం ప్రారంభం నుంచి ఉద్యమంలో పాల్గొనడంతో పాటు అదే స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చానని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావ్ అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ చాంబర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రపాలకులు అన్యాయం చేస్తున్నారని 2001లో కేసీఆర్ తెలంగాణా ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రతి ఉద్యమ కార్యక్రమంలో పాల్గొన్నానన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం జరిగిన జడ్పీ ఎన్నికల్లో మాక్లూర్ స్థానం జనరల్ కెటాగిరికి కేటాయించడంతో తాను పోటీ లేకుండానే ఏకగ్రీవంగా జడ్పీటీసీగా ఎన్నికయ్యానన్నారు. అదే విధంగా జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కూడా జనరల్ కెటాగిరి కావడంతో తనను జడ్పీ చైర్మన్‌గా నియమించారన్నారు. 2020లో దేశవ్యాప్తంగా నిజామాబాద్‌కు గుర్తింపు తీసుకొచ్చి దీన్‌దయాల్ అవార్డును అందుకున్న ఘనతను దక్కించుకున్నానన్నారు. అవార్డుకు వచ్చిన రూ50లక్షలతో జిల్లా పరిషత్ ఆవరణలో గల ఖాళీ స్థలంలో 15వాణిజ్య గదులను నిర్మించడం జరిగిందన్నారు. వాటి ద్వారా రూ3లక్షల ఆదాయం సమకూరుతుందన్నారు. ఇది జడ్పీకి శాశ్వత ఆదాయమని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇందల్వాయి, జూలై 4: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మూడెడ్ల తులసమ్మ, ఆమె భర్త గంగాధర్‌లపై అదే గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి దాడి చేయడంతో విషయం తెలుసుకున్న ముదిరాజ్ జిల్లా కమిటీ సభ్యులు గురువారం బాధిత కుటుంబానిన పరామర్శించారు. అన్ని విధాల ఆదుకుంటామని అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డి తులసమ్మకు సంబంధించిన సర్వే నంబరు 180లోగల 30గుంటల భూమిని అక్రమంగా కబ్జా చేస్తున్నాడని ఈ విషయంపై ఆ దంపతులకు అన్యాయం జరిగితే ఊరుకోమని అన్నారు. వారికి అండగా నిలబడి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. తులసమ్మ దంపతులను తీవ్రంగా గాయపర్చిన సంతోష్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై మనోజ్‌కుమార్ ఘటన స్థలానికి వివరాలు తెలుసుకున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో వెంకట్రావుకు బాధితుల చేత వినతి పత్రం అందజేశారు. వారి వెంట ముదిరాజ్ జిల్లా కమిటీ అధ్యక్షుడు మెతుకు శివ, రూరల్ అధ్యక్షుడు ఎర్ర రాజేందర్, ఇందల్వాయి మండల అధ్యక్షుడు మొచ్చ గోపాల్, కార్యవర్గ సభ్యులు రఘు, సంతోష్, మచ్చ శ్రీనివాస్, రఘురాం, శ్రీధర్ ఉన్నారు.


విజేతలను ప్రకటిస్తున్న ఆర్టీసీ అధికారులు

లక్కీడ్రా విజేతలకు బహుమతుల అందజేత

సుభాష్‌నగర్, జూలై 4: ఆర్టీసీ నూతనంగా ప్రవేశపెట్టిన డీలక్స్ బస్ మహిళా ప్రయాణికుల గిఫ్ట్ స్కీమ్ విజేతలకు ఆర్టీసీ అధికారులు బహుమతులను అందజేశారు. జిల్లా కేంద్రంలోని నూతన బస్టాండ్ ఆవరణలో లక్కీడ్రా తీసి విజేతలను ప్రకటించి బహుమతులను అందజేశారు. మొదటి విజేత రూప, రెండవ విజేత అక్షిత, మూడవ విజేత సృజనలకు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సౌజన్యంతో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి 15రోజులకు ఒకసారి లక్కీడ్రా ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ నుంచి వరంగల్ రూట్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన వారికి లక్కీడ్రా బాక్సులో టికెట్‌ను వేయాలని కోరారు. 15 రోజుల అనంతరం విజేతలను ప్రకటించి బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రతినిధులు అశోక్‌కుమార్ గోవర్ధన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి, డిపో మేనేజర్ ఆనంద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐటీఐలలో రెండో విడత అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్, జూలై 4: తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో (ఐటీఐ)లో ఉచితంగా అడ్మిషన్లు పొంది వివిధ కోర్సుల్లో అడ్మిషన్లు పొందేందుకు ఈ విద్యాసంవత్సరానికి గాను రెండవ విడత అడ్మిషన్‌ల కొరకు ఈనెల 4వ తేదీ నుంచి 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ బాలుర ప్రిన్సిపల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాల పైబడి ఉన్న అభ్యర్థులు అర్హులని అడ్మిషన్‌కు వయస్సు పరిమితి ఏమీ లేదని నోటిఫికేషన్, వివిధ కోర్సుల విద్యార్హతకు ఐటిఐ.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలన్నారు. మొదటి విడతలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు కేవలం వెబ్ ఆప్షన్లు పెట్టాలని జిల్లాలో ఐదు ప్రభుత్వ ఐటిఐలలో 1028 సీట్లు, మూడు ప్రైవేటు ఐటిఐలలో 488 సీట్లలో మిగిలిన సీట్లకు కొత్త అభ్యర్థులు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకొని కోర్సుల వారిగా వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. మెరిట్, రూలాఫ్ రిజర్వేషన్ వెబ్ ఆప్షన్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9948195654, 9490057403 నెంబర్‌లలో సంప్రదించాలన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూలై 4: జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులు 2024-25 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న వారు ప్రీమెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళా శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ అధికారిణి రసూల్‌బీ ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఈపాస్.సిజిజి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో ప్రధానోపాధ్యాయుల సిఫార్సుతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతో పాటు సదరం మెడికల్ సర్టిఫికెట్ కనీస వైకల్యం శాతం 40కి పైగా ఉండాలని, మండల అధికారిచే ధృవీకరించబడిన ఆధాయ ధృవీకరణ పత్రం రూ.లక్షలోపు ఉండాలని, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, అంగవైకల్యం చూపే ఫోటో, ప్రధానోపాధ్యాయుని సంతకం, స్టాంప్ తదితర ధృవీకరణ పత్రాలను జతచేయాలని ఆమె తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు తమ మండలం పరిధిలోని దివ్యాంగ విద్యార్థులకు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ విషయమై అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్, జూలై 4: తెలంగాణ నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పర్యావరణ సంబంధిత పోయెట్రి, పోస్టర్ మేకింగ్ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు గురువారం నగరంలోని కోటగల్లి శంకర్‌భవన్ ఉన్నత పాఠశాలలో బహుమతులు అందజేశారు. మొత్తం 28 పాఠశాలల నుంచి 195 మంది విద్యార్థులు, గైడ్ టీచర్లు హాజరయ్యారు. పోయెట్రి విభాగంలో సాహితి మొదటి బహుమతి, శ్రీవల్లి రెండవ బహుమతి, రాజశ్రీ మూడవ బహుమతి సాధించగా పోస్టర్ మేకింగ్‌లో సత్య సంహిత మొదటి బహుమతి, భవ్యశ్రీ రెండవ బహుమతి, టి.మహి మూడవ బహుమతి సాధించగా వీరికి జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ తదితరులు బహుమతులు అందజేశారు.

నేడు అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం

సుభాష్‌నగర్, జూలై 4: అటవీశాఖ ఆధ్వర్యంలో వజ్రోత్సవ వన మహోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీన తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం 1950 సంవత్సరంలో ప్రారంభమై నేటికి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం వజ్రోత్సవ వన మహోత్సవంగా నామకరణం చేసిందన్నారు. నగరంలోని సారంగపూర్ అర్బన్ పార్క్‌లో ఉదయం 9గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని అన్నారు.


సంజయ్‌ను పరామర్శిస్తున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

సంజయ్‌ను పరామర్శించిన ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూలై 4: దివంగత నాయకుడు డి.శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా ఆయన పెద్ద కుమారుడు, నగర మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌ని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వేల్పూర్ వాసిగా డి.శ్రీనివాస్ చేసిన కృషిని ఆయన గ్రామస్థాయి నుంచి ఢిల్లీస్థాయి వరకు ఎదిగిన క్రమాన్ని ఇరువురు మాట్లాడుకున్నారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఈ స్థాయికి చేరడం అసాధ్యమని రాజకీయాల్లో డిఎస్ తనదైన ముద్ర వేశారని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ నీరడి భాగ్య, తదితరులు ఉన్నారు.

కార్యకర్తను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

మోపాల్, జూలై 4: మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సత్యనారాయణను గురువారం నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పరామర్శించారు. ఇటీవల సత్యనారాయణ కూతురు మరణించిన విషయాన్ని తెలుసుకున్న బాజిరెడ్డి గోవర్ధన్ అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. కూతురు మరణంగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొచ్చ శ్రీను, రైతుసమన్వయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ధర్పల్లి మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ ఎంపీటీసీ భూమయ్య, ఆయా గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హైకోర్టు మాజీ జస్టిస్‌ను కలిసిన న్యాయవాదులు


విశ్రాంత న్యాయమూర్తిని సన్మానిస్తున్న జిల్లా న్యాయవాదులు

నిజామాబాద్ లీగల్, జూలై 4: నగరానికి విచ్చేసిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పి.ప్రకాష్‌రావును నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం జిల్లా న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన చట్టాలపై అవగాహన, సెమినార్లు, న్యాయవాద సమస్యలు తదితర అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, సీనియర్ న్యాయవాది కృపాకర్ రెడ్డి, రాజ్‌కుమార్ సుబేదార్, రవీందర్, మాణిక్‌రాజ్, వెంకటరమణగౌడ్, జైపాల్ శ్రీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

ఇందల్వాయి, జూలై 4: విద్యుత్ మరమ్మతులు ఓ ఇంట్లో చీకట్లు నింపాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన పరమేశ్వర్ (30) అనే యువకుడు నల్లవెల్లి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లి గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. నల్లవెల్లి గ్రామంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ మొరాయించడంతో విద్యుత్ మరమ్మతులు తెలిసిన పరమేశ్వర్‌ను రైతులు రిపేర్ చేసేందుకు తీసుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జంపర్ తెగిపోవడంతో దాన్ని మరమ్మతులు చేపట్టేందుకు ట్రాన్స్‌ఫార్మర్ నిలిపివేసి పనులు చేస్తున్న సమయంలో 11కెవి ద్వారా విద్యుత్ సరఫరా జరిగి షాక్ తగలడంతో పరమేశ్వర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. పక్కనే ఉన్న రైతులు ఆలోచించేలోపే ఒక్కసారిగా పరమేశ్వర్ ప్రాణాలు కోల్పోయాడని రైతులు తెలిపారు. పరమేశ్వర్‌కు షాక్ తగిలి కిందపడ్డాడు. వెంటనే రైతులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి విద్యుత్ సరఫరా నిలిపివేసినప్పటికి అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మృతునికి భార్య, ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారని అన్నారు. పరమేశ్వర్ మృతి చెందాడన్న వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని అక్కడున్న వారిని వేడుకున్నారు.

చికెన్ ధరలు




రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	రూ.155	రూ.285	రూ. 305

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,100	రూ.67,400	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1: కల్కి(3డి తెలుగు) (5.50, 9.20, 12.50, 4.20, 7.50, 11.20)
స్ర్కీన్-2: కల్కి(3డి తెలుగు) (6.10, 9.40, 3.30, 7.00, 10.30)
: ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (1.10)
స్ర్కీన్-3: కల్కి(తెలుగు) (5.40, 9.10, 12.40, 7.10, 10.40) : మహారాజ (4.10)
స్ర్కీన్-4 : కల్కి(తెలుగు) (5.30, 9.00, 12.30)
: ముంజియా (హిందీ) (4.00)
: కల్కి(హిందీ) (6.45, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : కల్కి(తెలుగు) (12.00, 3.30, 7.00, 10.35)
స్ర్కీన్-2 : కల్కి(తెలుగు) (1.20)
స్ర్కీన్-3 : కల్కి(తెలుగు) (10.30)
: కల్కి(3డి తెలుగు) (4.45, 9.30)

దేవి : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి(హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి(11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్